ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
బుధవారం, 09 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 25 | పేజీలు: 4 వెల: 5

## రిజిస్ట్రేషన్లపై సబ్‌రిజిస్ట్రార్ పెత్తనం!

- భూమి రిజిస్ట్రేషన్‌కు వస్తే లంచాల బాదుడేనా?
- నిబంధనలు పక్కనపెట్టి రైటర్లకు సలహాలు.. సూచనలు
- ప్రజల నుంచి వసూళ్లు.. రిజిస్ట్రేషన్లలో ప్రత్యేక 'సౌకర్యాలు'
- డీఆర్వో గారూ.. నర్సంపేట ఆఫీసుపై మీ నిఘా ఎక్కడ?
- ఉన్నతాధికారుల అండతోనే ఇంత హల్చల్ చేస్తున్నారా?




2

## సరిహద్దులు దాటుతున్న సన్నబియ్యం!

### పేదల బియ్యానికి దళారుల ఎసరు

- ములుగు నుంచి పక్క రాష్ట్రాలకు అక్రమ రవాణా
- గ్రామాల్లోనే సేకరణ.. రాత్రివేళ లారీల్లో తరలింపు
- కిలో రూ.15కు కొనుగోలు.. రూ.30కిపైగా విక్రయం
- 4 కేసుల్లో 1,735 బస్తాలు.. 599.20 క్వింటాళ్ల పట్టివేత
- 3 నెలల కోటాతో ముమ్మరమైన సేకరణ.. కొరవడిన నిఘా



కాకతీయ, ఏటూరునాగారం : పేదల పళ్లెంలోకి చేరాల్సిన సన్నబియ్యం పక్క రాష్ట్రాల మార్కెట్లకు తరలుతోంది. ములుగు జిల్లాలో గ్రామాల నుంచే పీడీఎస్ బియ్యం సేకరించి రాత్రివేళ లారీల్లో తరలించే వ్యవస్థ కొనసాగుతోంది. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తున్న దళారులు.. అదే బియ్యాన్ని చత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని రైస్‌మిల్లులు, కోళ్లదాణా ఫ్యాక్టరీలకు

........(తరువాయి 2లో)



# ఎర్రవల్లిలో ఉద్రిక్తత



### కేసీఆర్ ఫాం హౌస్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దప్పుల మోతకు కాంగ్రెస్ పిలుపు
- పోలీసులు అడ్డుకోవడంపై బీఆర్ ఎస్ నేతల ఆగ్రహం
- హకీంపేట నుంచి పాదయాత్రగా
- బయల్దేరి వెళ్లేందుకు యత్నాలు
- కేటీఆర్, హరీశ్‌రావు సహ పలువురు నేతల అరెస్టు
- బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ పీఎస్‌ల వద్ద ఉద్రిక్తత
- అసెంబ్లీ ఘటనపై హైకోర్టులో ప్రభుత్వ పిటిషన్
- స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం..
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యకు తీర్మానం
- రెండోరోజు హాట్ హాట్‌గా రాజకీయ పరిణామాలు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో/ ఎర్రవల్లి :** అసెంబ్లీ సమావేశాల రెండో రోజూ రాజకీయ ఉద్రిక్తత కొనసాగింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ దప్పుల మోత కార్యక్రమానికి పిలుపునివ్వడం, దానికి ప్రతిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫామ్‌హౌస్ వైపు బయలు దేరడంతో పరిస్థితి వేడెక్కింది. ఎర్రవల్లి పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాదయాత్రగా ఎర్రవల్లి వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. మరోవైపు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యాఖ్యల వివాదం తీవ్రరూపం దాల్చింది. దీంతో సభలోనూ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది.

**ఎర్రవల్లికి భారీగా బలగాలు**

కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దప్పుల మోత కార్యక్రమానికి కాంగ్రెస్ పిలుపునివ్వడంతో ఎర్రవల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు భారీగా బలగాలను మోహరించి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

........(తరువాయి 2లో)

## కేసీఆర్ హత్యకు కుట్రలు

- ఫామ్‌హౌస్ వరకు కాంగ్రెస్ శ్రేణులను ఎలా అనుమతించారు
- బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారు
- కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



3

## తాతా మధు వ్యాఖ్యలు బీఆర్ఎస్ స్క్రిప్టే

- కేసీఆర్ పదేళ్ల పాలనలో దళితులకు అన్యాయం
- కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డికే సామాజిక స్పృహ ఎక్కువ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



3

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు కోర్టులో ఊరట

- రిమాండ్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు
- వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు
- రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు
- అసెంబ్లీ ఆవరణలో ఘర్షణల నేపథ్యంలో అరెస్టు

2





- రాష్ట్రంలో పాలన గాడి తప్పింది.. లా అండ్ ఆర్డర్ మంటగలిసింది
- కేసీఆర్ ఇంటిపై దాడి వికృత చర్య
- డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల జీవితాలు మార్చలేరు
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగితే చర్చ ఎందుకు లేదు?
- కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన విధించాలి
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు



## కలియుగ దుశ్శాసనుడు రేవంత్‌రెడ్డి

### గౌరవ సభ కాదు.. కౌరవ సభగా మార్చారు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

కలియుగ దుశ్శాసనుడిగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గౌరవ సభగా ఉండాల్సిన అసెంబ్లీని కౌరవ సభగా మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ జోక్యం చేసుకుని తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు.



రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరిగితే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే చర్చ జరగకుండా ప్లాన్ చేశారని ఆరోపించారు. పత్రికల హెడ్‌లైన్లను మార్చగలరేమో కానీ ప్రజల జీవితాలను మార్చలేరని అన్నారు. సోషల్ మీడియా ట్రెండ్‌ను మార్చగలరేమో కానీ రైతులు, విద్యార్థుల కష్టాలను మార్చలేరని పేర్కొన్నారు.

........(తరువాయి 2లో)

## కాంగ్రెస్.. బీఆర్ఎస్ దొందూ దొందే

- అసెంబ్లీ తీరును చూసి జనం అసహ్యించుకుంటున్నారు
- ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ డ్రామాలెందుకు
- 22ఏళ్లతో జనం అల్లాడుతుంటే భూ దందాలపై చర్చేది
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉద్యోగుల సమస్యలపై చర్చించాలి
- ప్రజాస్వామ్య నిరసనలను అడ్డుకోవడం తప్పే
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల బజారు భాషను చూసి జనం నవ్వుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాల్సిన శాసనసభను రాజకీయాలకు వాడుకుంటారా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరన్నారు. తాతా మధుతోపాటు పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా కొట్టడం కూడా తప్పేనని, బాధ్యులైన పోలీసులపై

........(తరువాయి 2లో)




## గూండాగిరికి ముఖ్యమంత్రి ప్రొత్సాహం

- ఇలాంటి సీఎంతో శాంతిభద్రతలు ఏం కావాలి?
- రాజకీయ ప్రత్యర్థిని ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం ఏమిటి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

3

## కడియం సిగ్గుపడు..!

- కేసీఆర్ దళితులకు ఏం చేయలేదా.?!
- ఎన్టీఆర్ తర్వాత నీకు రాజకీయ బిక్ష పెట్టింది కేసీఆర్ కాదా?
- గల్లీలో ఉన్న నిన్ను ఢిల్లీకి తీసుకెళ్లింది ఎవరు?
- పార్టీలో గుర్తింపు, పదవి కల్పించింది కేసీఆర్ కాదా?
- పదవుల కోసం రేవంత్‌రెడ్డిని వెనకేసుకొస్తున్నావా?
- నిజంగా దళిత పక్షపాతివైతే స్పీకర్ పోడియం ముందు కూర్చో
- ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఫైర్



3

# రిజిస్ట్రేషన్లపై సబ్‌రిజిస్ట్రార్ పెత్తనం!

**కాకతీయ, వరంగల్ బ్యూరో:** నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, ప్లాట్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలపై అదనపు వసూళ్ల భారం పడుతోంది. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కాకుండా కార్యాలయ వ్యవహారాల పేరుతో అదనపు మొత్తాలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్తి పత్రాలు చేతిలో పట్టుకుని కార్యాలయానికి వచ్చే సామాన్యులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడి నుంచి మొదలయ్యే వ్యవహారం చివరకు సబ్‌రిజిస్ట్రార్ స్థాయి వరకు వెళ్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన అధికారి స్థాయిలోనే రైటర్లకు సూచనలు, సలహాలు అందుతుండటంతో కార్యాలయంలో అధికారిక వ్యవస్థకు సమాంతరంగా మరో వ్యవస్థ నడుస్తోందన్న పరిస్థితి కనిపిస్తోంది.




**లంచం ఇవ్వకపోతే రిజిస్ట్రేషన్ కష్టమేనా?**

భూమి రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలకు ప్రతి దశలోనూ అదనపు ఖర్చులు తప్పడం లేదన్న విషయం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. సాధారణ రిజిస్ట్రేషన్‌కు నిర్ణయించిన ప్రభుత్వ రుసుములతో పాటు అదనంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే దానికి బాధ్యత ఎవరిది? ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తం ఎంత? కార్యాలయంలో అదనంగా వసూలు చేస్తున్న మొత్తం ఎంత? అనే వివరాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం బహిరంగంగా ప్రదర్శించాల్సి ఉంది. అధికారిక రుసుములు చెల్లించిన తర్వాత కూడా అదనపు డబ్బు ఎందుకు ఇవ్వాలి? ఇవ్వకపోతే పత్రాల్లో కొర్రీలు, జాప్యం ఎందుకు ఎదురవుతోంది? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలి. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసే వ్యవస్థ ఉంటే దానిని అడ్డుకోవాల్సిన బాధ్యత సబ్‌రిజిస్ట్రార్‌పైనే ఉంది.

**రైటర్లకు సబ్‌రిజిస్ట్రార్ సలహాలెందుకు?**

డాక్యుమెంట్ రైటర్లు పత్రాలు సిద్ధం చేయడం వారి పని. వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి రిజిస్ట్రేషన్ చేయడం సబ్‌రిజిస్ట్రార్ బాధ్యత. కానీ నర్సంపేట కార్యాలయంలో కొన్ని రిజిస్ట్రేషన్ల విషయంలో పత్రాలను ఏ విధంగా సిద్ధం చేయాలి, సాంకేతిక లోపాలను ఎలా సరిచేయాలి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్లాలి వంటి అంశాల్లో సబ్‌రిజిస్ట్రార్ నుంచే రైటర్లకు సూచనలు అందుతున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ చేయాల్సిన అధికారి స్వయంగా పత్రం తయారు చేసే వ్యక్తులకు మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఏమిటి? సాధారణ ప్రజల పత్రాలకు వర్తించే నిబంధనలు రైటర్ల ద్వారా వచ్చే పత్రాలకు కూడా అదే విధంగా వర్తిస్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**వివాదాస్పద భూములకూ దారులు తెరుస్తున్నారా?**

యాజమాన్య హక్కులపై వివాదాలు ఉన్న భూములు, ఒకే ఆస్తిపై వరుస లావాదేవీలు, గతంలో అభ్యంతరాలు వచ్చిన పత్రాలు, నిషేధిత ఆస్తుల జాబితాకు సంబంధించిన వ్యవహారాలు రిజిస్ట్రేషన్ సమయంలో ప్రత్యేకంగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి పత్రాల్లో ఉన్న సమస్యలను అధిగమించే మార్గాలపై సూచనలు అందుతున్నట్లయితే అది తీవ్రమైన పరిపాలనా అంశం. సామాన్యుడి పత్రంలో చిన్న లోపం ఉన్నా కొర్రీ పెట్టే కార్యాలయం.. పలుకుబడి ఉన్నవారి పత్రాల విషయంలో మాత్రం నిబంధనలను పక్కన పెడుతోందా? అన్నది తేలాల్సి ఉంది. గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లలో వివాదాస్పద ఆస్తులను గుర్తించి వాటి పత్రాలను తిరిగి పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడుతుంది.

**రైటర్ల చుట్టూనే మొత్తం వ్యవహారమా?**

నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు నేరుగా అందాల్సిన సేవలు డాక్యుమెంట్ రైటర్ల చుట్టూనే తిరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వ్యక్తి ముందుగా రైటర్‌ను సంప్రదించాలి.. అక్కడి నుంచి పత్రం సిద్ధమవుతుంది.. ఆ తర్వాత కార్యాలయంలో ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఈ వ్యవస్థలో రైటర్లు, కార్యాలయ సిబ్బంది, అధికారుల మధ్య ఏర్పడిన సమన్వయం కారణంగానే అదనపు వసూళ్లకు అవకాశం ఏర్పడుతోందన్న చర్చ ఉంది. ప్రజల నుంచి ఎంత వసూలు చేస్తున్నారు? అందులో ఎవరి పాత్ర ఎంత? రిజిస్ట్రేషన్ ఆలస్యం, కొర్రీల విషయంలో ఏదైనా ప్రత్యేక విధానం అమలవుతోందా? అన్నది సీసీ కెమెరాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు, ఫీజు చలాన్లు పరిశీలిస్తే స్పష్టమవుతుంది.


**డీఆర్వో గారూ.. మీ నిఘా ఎక్కడ?**

నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు? ప్రజల నుంచి అదనపు వసూళ్లపై ఫిర్యాదులు, చర్చలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆకస్మిక తనిఖీలు ఎందుకు జరగలేదు? డీఆర్వో కార్యాలయానికి ఈ వ్యవహారాలపై సమాచారం ఉందా? ఉంటే చర్యలు ఎందుకు తీసుకోలేదు? సబ్‌రిజిస్ట్రార్‌కు ఉన్నతాధికారుల అండ ఉందనే ప్రచారం నిజమా? లేక కింది స్థాయిలో జరుగుతున్న వ్యవహారాలు ఉన్నతాధికారుల దృష్టికి చేరడం లేదా? అనే ప్రశ్నలు ఇప్పుడు నేరుగా జిల్లా అధికారుల ముందున్నాయి. నర్సంపేట కార్యాలయంలో గత కొంత కాలంగా జరిగిన రిజిస్ట్రేషన్లు, వాటికి సంబంధించిన ఫీజు చలాన్లు, కొర్రీలు, సీసీ కెమెరా దృశ్యాలు, డాక్యుమెంట్ రైటర్ల వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరిపి ప్రజల నుంచి అదనపు వసూళ్లు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయా? ఎవరి సహకారంతో ఈ వ్యవస్థ కొనసాగుతోంది? అన్నది డీఆర్వో, ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

# సరిహద్దులు దాటుతున్న సన్నబియ్యం!

(మొదటిపేజీ తరువాయి)

కిలో రూ.30కిపైగా ధరకు విక్రయిస్తున్నారు. ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట, ఏటూరు నాగారం, తాడ్వాయి, వాజేడు, మంగపేట, నూగూరు వెంకటాపురం ప్రాంతాల్లో గ్రామస్థాయిలోనే సేకరణ సాగుతోంది. దీంతో ప్రభుత్వ ఉద్దేశం నీరుగారడంతో పాటు పేదలకు అందాల్సిన బియ్యం అక్రమ వ్యాపారానికి తరలుతోంది.



**లారీల్లో తరలింపు.. భారీగా పట్టివేత**

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఇప్పటికే నమోదైన కేసులతో స్పష్టమవుతోంది. మార్చిలో ములుగు మండలంలోని గ్రామాల నుంచి సేకరించిన 28 క్వింటాళ్ల బియ్యాన్ని జిల్లా కేంద్రంలోని మార్కెట్ సమీపంలో నిల్వ చేసి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచగా పోలీసులు పట్టుకున్నారు. జూలై 11న తాడ్వాయి వద్ద రాత్రివేళ లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జూలై 18న గోవిందరావుపేట మండలం పస్రా సమీపంలో మరో 298 క్వింటాళ్ల సన్నబియ్యం లారీలో తరలిస్తుండగా పట్టుకుని లారీని సీజ్ చేశారు. ఇప్పటివరకు 4 కేసుల్లో 1,735 బస్తాలు, 599.20 క్వింటాళ్ల బియ్యం పట్టుబడటం జిల్లాలో అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తోంది.

**వేలిముద్ర వేయించి.. బియ్యం బయటకు?**

గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసేందుకు దళారులు ప్రత్యేకంగా వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు కొందరు రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని బియ్యం పంపిణీ చేయకుండా కిలోకు రూ.18 నుంచి రూ.20 వరకు నగదు చెల్లించి ఆ బియ్యాన్ని దళారులకు అప్పగిస్తున్న వ్యవహారం కూడా కొనసాగుతోంది. దీంతో రేషన్ దుకాణాల పరిధిలోనే బియ్యం చేతులు మారుతోంది. సేకరించిన బియ్యంలో కొంత మొత్తాన్ని రైస్‌మిల్లులకు తరలించి సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి చేరుస్తున్న విధానం ఉన్నట్లయితే దానిపై కూడా పూర్తి స్థాయిలో తనిఖీ అవసరం. లబ్ధిదారుడి వేలిముద్ర నుంచి రేషన్ దుకాణం, దళారి, రవాణా వాహనం, రైస్‌మిల్లు వరకు మొత్తం సరఫరా గొలుసును పరిశీలిస్తే అసలు వ్యవస్థ బయటపడుతుంది.

**3 నెలల కోటాతో పెరిగిన సేకరణ**

వర్షాకాలంలో రేషన్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రభుత్వం 3 నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో గ్రామాల్లో సేకరణ మరింత పెరిగింది. లబ్ధిదారుల వద్ద అదనంగా చేరిన బియ్యాన్ని దళారులు ముందుగానే గ్రామాల్లో సేకరించి నిల్వలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రివేళ లారీల్లో ములుగు జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పక్క రాష్ట్రాల్లో కిలోకు రూ.30కిపైగా ధర లభిస్తుండటంతో గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి బయట మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారానికి లాభదాయక సరుకుగా మారింది.

**పట్టుబడుతున్నా.. దందా ఆగేదెప్పుడు?**

4 కేసుల్లో భారీగా బియ్యం పట్టుబడినప్పటికీ గ్రామాల్లో సేకరణ, నిల్వలు, రాత్రివేళ రవాణా కొనసాగుతున్నాయి. దీంతో పౌరసరఫరాల శాఖ నిఘాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో బియ్యం ఎవరు సేకరిస్తున్నారు? రేషన్ దుకాణాల నుంచి బియ్యం ఎలా బయటకు వెళ్తోంది? లారీల ద్వారా పక్క రాష్ట్రాలకు తరలించే ముందు ఎక్కడ నిల్వ చేస్తున్నారు? సరిహద్దు మార్గాల్లో తనిఖీలు ఎలా జరుగుతున్నాయి? ఇప్పటికే పట్టుబడిన 1,735 బస్తాల వెనుక ఉన్న సరఫరా గొలుసును అధికారులు గుర్తించారా? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. పట్టుబడిన వాహనాలు, బియ్యం యజమానులు, రేషన్ డీలర్లు, మధ్యవర్తుల లింకులను గుర్తించి మొత్తం వ్యవస్థపై చర్యలు తీసుకున్నప్పుడే అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. లేదంటే కేసులు నమోదవుతున్నా.. పేదల బియ్యం సరిహద్దులు దాటే దందా మాత్రం కొనసాగుతూనే ఉంటుంది.

## కాంగ్రెస్.. బీఆర్ఎస్ దొందూ దొందే

(మొదటిపేజీ తరువాయి)

కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

**ప్రజా సమస్యలపై చర్చేదీ**

22ఏతో ప్రజలు అల్లాడుతున్నారని, మంత్రులు, అధికార పార్టీ నేతల వేల కోట్ల భూ దందాలపై చర్చ జరగాలని బండి సంజయ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక, సర్టిఫికెట్లు రాక లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సాగునీరు అందక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అల్లాడుతున్నారని, ఐటీ సంస్థలు, పరిశ్రమలు మూతపడుతున్నాయని విమర్శించారు. డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 6 గ్యారెంటీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా అన్నట్టుగా కాంప్రమైజ్ రాజకీయాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై దాడి, కేసీఆర్‌పై హత్యాయత్నం పెద్ద జోక్ అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ఎర్రవల్లిలోనైనా సమావేశాలు నిర్వహించి ఆయనను హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉండే అర్హతను ఎప్పుడో కోల్పోయిందని విమర్శించారు. పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతిని నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని, ప్రజా సమస్యలు చర్చకు రాకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని, డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బండి సంజయ్ అన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు కోర్టులో ఊరట

- రిమాండ్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు
- వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు
- రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు
- అసెంబ్లీ ఆవరణలో ఘర్షణల నేపథ్యంలో అరెస్టు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ శాసనసభ ఆవరణలో జరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. వారిని రిమాండ్‌కు తరలించాలన్న పోలీసుల అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించి, వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. అసెంబ్లీ పరిసరాల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలీసులు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలను అదుపులోకి తీసుకుని అనంతరం



నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఎమ్మెల్సీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేయడం వంటి ఆరోపణలు ఉన్నట్లు పోలీసులు కోర్టుకు వివరించారు. రిమాండ్ కోరుతూ దాఖలు చేసిన అభ్యర్థనపై ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల అభ్యర్థనను తిరస్కరించింది. ఎమ్మెల్సీలు ఇద్దరూ రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలను వెంటనే విడుదల చేయనున్నారు. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనలపై పోలీసులు తీసుకున్న చర్యలకు కోర్టు నిర్ణయం ఎదురుదెబ్బగా మారిందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నేతలు తమ ఎమ్మెల్సీలకు మద్దతుగా నిలుస్తున్నారు. ఘటనకు సంబంధించిన పరిణామాలు రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది.

## కలియుగ దుశ్శాసనుడు రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల తీర్పును కూడా మార్చలేరని స్పష్టం చేశారు. రాజకీయ మళ్లింపులను ఆపి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు అడుగుతున్న రూ.4 వేల పింఛన్ ఏమైందని, పెంచుతామని చెప్పిన రైతు భరోసా ఏమైందని ప్రశ్నించారు. వెయ్యి రోజులు గడిచినా 6 గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. పెండింగ్ బకాయిలతో సహా ప్రజలకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం యాపులు పెట్టి ప్రజల ఉసురు పోసుకుంటున్నారని, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని, కరెంట్ ఇవ్వలేక ప్రభుత్వం చేతులెత్తేస్తోందని ఆరోపించారు. ఏపీలో క్రాప్ హాలిడే లేకపోయినా తెలంగాణలో ఈ చేతగాని ప్రభుత్వ పాలన వల్ల క్రాప్ హాలిడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

**కేసీఆర్ హయాంలో ఈ సమస్యలేవి?**

కేసీఆర్ పాలనలో ఇలాంటి సమస్యలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎందుకు మొదలయ్యాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, ఉద్యోగులు పీఆర్సీ, డీఏ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కరోనా, పెద్దనోట్ల రద్దు వంటి పరిస్థితులు ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను క్లియర్ చేసిందని పేర్కొన్నారు. ఇప్పుడు జాబ్ క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చారని విమర్శించారు. 22ఏ పేరుతో రాత్రికి రాత్రే భూములను నిషేధిత జాబితాలో చేర్చి ప్రజల గుండెలపై బండ వేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరగలేదని స్పీకర్ ఎలా చెబుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు. జరిగిన ఘటనను దేశమంతా చూసిందని, మీడియాలో కూడా వచ్చిందని అన్నారు. ఫిర్యాదు ఇచ్చినా కేసు నమోదు చేయలేదని, పైగా దాడికి గురైన సునీతమ్మ, సబితమ్మ, కోవా లక్ష్మిపై కేసులు పెట్టారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టడం ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లుగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగి, గొంతు పిసికి, అరెస్టులు చేసి ప్రభుత్వం వికృతానందం పొందుతోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు పిసికారని, ఆ తర్వాత సబితమ్మ గొంతు పిసికారని ఆరోపించారు. ఇప్పుడు తెలంగాణ తెచ్చిన కేసీఆర్ ఇంటిపైకి దాడికి కాంగ్రెస్ శ్రేణులను ఉసిగొల్పారని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు రోప్ పార్టీ, ఎస్కార్ట్ ఇచ్చి కేసీఆర్ ఇంటికి దగ్గరుండి పంపించారని ఆరోపించారు.

**స్పీకర్‌పై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పినా..**

స్పీకర్‌ను ఉద్దేశించి కావాలని మాట్లాడలేదని, అందుకు క్షమాపణలు చెబుతున్నానని తాతా మధు ఇప్పటికే చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనపై అసెంబ్లీలో ఎందుకు చర్చ జరగడం లేదని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలకు మైకులు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కలియుగ దుశ్శాసనుడైన రేవంత్‌రెడ్డి వ్యవహారం ఆనాడు ద్రౌపదికి జరిగిన అవమానాన్ని గుర్తు చేస్తోందని అన్నారు. సభలో తమ వాదన చెప్పుకునేందుకు బీఆర్ఎస్ సభ్యులకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. గౌరవ సభను కౌరవ సభగా మార్చారని మండిపడ్డారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులు తీసుకెళ్తే అడ్డుకోవడం లేదని, తాము టీషర్టులు వేసుకుంటే మాత్రం అడ్డుకుంటున్నారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ బంధం ఇదేనని విమర్శించారు. అసెంబ్లీలో బడివే అని, తంతం అని మాట్లాడటం వికృత భాష కాదా అని ప్రశ్నించారు. తాము 6 గ్యారెంటీల గురించి ప్రశ్నిస్తే మాత్రం తమ భాషను వికృత భాషగా చిత్రీకరిస్తున్నారని అన్నారు.

**కేసీఆర్ ఇంటిపై దాడి.. వికృత చర్య**

కేసీఆర్ ఇంటిపై దాడి చేయడం అత్యంత వికృత చర్య అని హరీశ్‌రావు అన్నారు. ప్రతిపక్ష నేత ఇంటిపై దాడికి ప్రభుత్వం ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపై దాడి జరిగినందుకు కూడా భేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. కేటీఆర్, యాదవ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, సంజయ్, తనతో పాటు పలువురికి దెబ్బలు తగిలాయని చెప్పారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా తమ ఫిర్యాదులను తీసుకోవడం లేదని ఆరోపించారు.

**రాష్ట్రపతి పాలన విధించాలి**

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, లా అండ్ ఆర్డర్ నియంత్రణలో లేదని హరీశ్‌రావు అన్నారు. అన్ని వర్గాలపై దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వాన్ని నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన మంటగలిసిందని పేర్కొన్నారు. కేంద్రం, గవర్నర్ జోక్యం చేసుకుని తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి కూడా హరీశ్‌రావు ప్రశ్నలు సంధించారు. లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకుని గూండాల్లా వ్యవహరిస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్‌గాంధీకి తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ భక్షణ కనిపించడం లేదా అని నిలదీశారు.

**శంకర్ వ్యాఖ్యలపై చర్య తీసుకోవాలి**

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్ చావాలని అన్నారంటూ హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఇలాంటి వ్యాఖ్యలు దారుణమని, వెంటనే ఆయనపై తీర్మానం పెట్టి సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి తర్వాత ప్రతిపక్ష నాయకుడి స్థానమే అత్యంత కీలకమని, అలాంటి నాయకుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్పీకర్‌ను ప్రశ్నించారు. 119 మంది ఎమ్మెల్యేలను సమానంగా చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని అన్నారు. ఎందుకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీ సమయాన్ని 2 రోజులుగా వృథా చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఈ వ్యవహారాన్ని వదిలిపెట్టబోదని, ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉంటామని, ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# ఎర్రవల్లిలో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఫామ్‌హౌస్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వమే పోలీసుల సహకారంతో కాంగ్రెస్ నేతలను ప్రోత్సహిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. సీఎం రేవంత్‌రెడ్డి దాడులకు ఉసిగొల్పుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విమర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు బయలుదేరారు.

**హకీంపేట వద్దే అడ్డుకున్న పోలీసులు**

ఫామ్‌హౌస్ వైపు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను హకీంపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శాసనసభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, జగదీశ్‌రెడ్డి, వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి హకీంపేట నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పీఎస్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పీఎస్‌కు తీసుకెళ్లారు. కేసీఆర్ ఇంటిపైకి ఎవరినీ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది బలగాలను మోహరించినట్లు వెల్లడించారు. అయితే కాంగ్రెస్ శ్రేణులకు ఎస్కార్ట్, రోప్ పార్టీలు ఇచ్చి ఫామ్‌హౌస్ వైపు తీసుకెళ్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను చూపించారు. కాంగ్రెస్ నేతలకు ఎస్కార్ట్ ఇచ్చి తీసుకెళ్తున్నారని విమర్శిస్తూ వెల్‌డన్ డీజీపీ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ, మీ మోహబత్ కీ దుకాణ్ చూడండి అని అన్నారు. పోలీసులపై నమ్మకం లేదని, తమ నాయకుడిని తామే కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులను ఎర్రవల్లి వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

**పోలీస్ స్టేషన్ల వద్ద ఉద్రిక్తత**

బీఆర్ఎస్ నేతల అరెస్టుల విషయం తెలియడంతో ఆ పార్టీ శ్రేణులు బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లకు భారీగా తరలివచ్చాయి. జవహర్‌నగర్ పీఎస్ ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు బైఠాయించి హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేల అరెస్టులకు నిరసన తెలిపారు. బోయిన్‌పల్లి పీఎస్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాలను పోలీసులు అదుపు చేసే ప్రయత్నం చేశారు. పీఎస్ ఎదుట రాళ్లు, కుర్చీలు విసిరేసుకున్న ఘటన కూడా చోటుచేసుకుంది. కాంగ్రెస్ మహిళా కార్యకర్తపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి.

**అసెంబ్లీ ఘటనపై హైకోర్టులో పిటిషన్**

అసెంబ్లీ ఎదుట తొలిరోజు జరిగిన ఘటనపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించిందని, ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించిందని కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వం సవరణ కోరింది. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించారని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు వారిని అడ్డుకున్నారని ఏజీ కోర్టుకు వివరించారు. శాసనసభ్యుల నియమావళిని ఉల్లంఘించినందుకే పోలీసులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిషేధాజ్ఞలను ఉల్లంఘించారని, విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లను దూషించారని, పోలీసులను నెట్టివేసి దుర్భాషలాడారని వాదించారు. సభ సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని, స్పీకర్ ఆదేశాలతోనే పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**స్పీకర్ చాంబర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం**

తొలిరోజు అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో పరామర్శించారు. నిన్నటి ఘటనలపై విచారం వ్యక్తం చేసిన సీఎం.. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్‌కు తెలిపారు. ఇదే సమయంలో స్పీకర్ తన పరిధి, అధికారాలపై చిట్‌చాట్‌లో మాట్లాడారు. అసెంబ్లీలో సభ్యుడు కాకపోయినా తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకు ఉందని, అయితే వెంటనే బహిష్కరించే విధంగా కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తున్నామని గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. మెయిన్ గేటు తన పరిధిలోనే ఉంటుందని, మహిళా సభ్యులపై అనుచితంగా ప్రవర్తించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**స్పీకర్ వ్యాఖ్యలపై సభలో రగడ**

స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఆమోదించింది. అనంతరం తీర్మానాన్ని శాసనమండలికి పంపించారు. స్పీకర్‌ను అవమానించామనే పశ్చాత్తాపం బీఆర్ఎస్ నేతల్లో కనిపించడం లేదని దామోదర రాజనర్సింహ అన్నారు. రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి అవమానానికి గురికావడం బాధాకరమని పేర్కొన్నారు. స్పీకర్‌ను అవమానించడం అంటే ఒక వ్యక్తిని అవమానించడం కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్పీకర్‌ను తిట్టడం అంటే సభ మొత్తాన్ని దూషించినట్లేనని వ్యాఖ్యానించారు. ఇద్దరు ఎమ్మెల్సీల తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉందన్నారు. ఎస్సీ వర్గాల నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉన్నందున ఆయన పదవిని గౌరవించాలని సూచించారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తెలిపారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సభలో డిమాండ్ చేశారు. స్పీకర్ పదవికి ప్రజాస్వామ్యంలో అత్యున్నత గౌరవం ఉందని, దానిని కాపాడుకోవాలని సూచించారు. తాతా మధును శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని ఎంఐఎం డిమాండ్ చేసింది. ఈ అంశాన్ని త్వరగా ముగించి ఇతర ప్రాధాన్య అంశాలపై చర్చ చేపట్టాలని అక్బరుద్దీన్ కోరారు.

**బీజేపీ వాకౌట్.. రాగమయి విమర్శలు**

సభా సమయం వృథా చేస్తున్నారంటూ బీజేపీ శాసనసభ నుంచి వాకౌట్ చేసింది. తొలిరోజు జరిగిన ఘటనలు నీచాతినీచమైన సంస్కృతికి నిదర్శనమని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ నేతల అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. నియమావళి ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సభ తీసుకునే ఎలాంటి చర్యకైనా కట్టుబడి ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాగమయి విమర్శించారు. రోజుకొక వేషంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు. మహిళా పోలీసుల పట్ల బీఆర్ఎస్ నేతలు అభ్యంతరకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. చొక్కాలు విప్పి మహిళా పోలీసుల మొహాలపై విసిరేశారని మండిపడ్డారు. వారిని ఇలాగే ఉపేక్షిస్తే మరింత రెచ్చిపోయే ప్రమాదముందని, సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**ఇద్దరు ఎమ్మెల్సీలకు కోర్టులో ఊరట**

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల రిమాండ్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఇద్దరు ఎమ్మెల్సీలు పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అసెంబ్లీ సమావేశాల రెండో రోజు పరిణామాలను చూస్తే.. తొలిరోజు సభ గేటు వద్ద మొదలైన ఘర్షణ రెండో రోజు ఎర్రవల్లి వరకు విస్తరించింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ కార్యక్రమానికి పిలుపు, దానికి బీఆర్ఎస్ ప్రతిస్పందన, పోలీసుల మోహరింపు, నేతల అరెస్టులు, పోలీస్ స్టేషన్ల వద్ద ఆందోళనలు ఒకవైపు కొనసాగగా.. మరోవైపు స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ ఘర్షణకు కారణమైంది. దీంతో అసెంబ్లీ సమావేశాల్లో అసలు ప్రజా సమస్యలపై చర్చకు ఎంత సమయం దొరుకుతుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# భూ రీసర్వేలో లోపాలకు తావివ్వొద్దు

- రికార్డులతో వివరాలను సరిచూసి సర్వే చేయాలి
- గ్రామ సరిహద్దులు, భూముల విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి
- అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ ఆదేశం



**కాకతీయ, పెద్దవంగర:** భూముల రీ సర్వేను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అధికారులను ఆదేశించారు. పెద్దవంగర మండలం పోచారం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత రికార్డులతో సరిపోల్చాలని అదనపు కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ శ్రీ నితీష్, తహసీల్దార్ వినోద్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డిప్యూటీ సర్వేయర్, లైసెన్స్డ్ సురేందర్, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

# సేవల్లో నిర్లక్ష్యం వద్దు

- మహిళలకు సమర్థంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి
- అనుమానిత కేసులకు వెంటనే తదుపరి సేవలు అందించాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి ఆదేశం



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి అన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మహిళలకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కీర్తినగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సోమవారం డా. రాజారెడ్డి ఆకస్మికంగా పర్యవేక్షించారు. క్లినిక్‌లో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. మహిళా రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు, స్క్రీనింగ్, ఆరోగ్య పరీక్షలపై ఆరా తీశారు. స్క్రీనింగ్‌లో గుర్తించిన అనుమానిత కేసులకు తదుపరి పరీక్షలు, చికిత్స, రిఫరల్ సేవలను వెంటనే అందించాలని సూచించారు. ప్రతి మంగళవారం నిర్ణీత సమయాల్లో ఆరోగ్య మహిళా క్లినిక్‌లను తప్పనిసరిగా నిర్వహించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.

# ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకోవాలి

**పరకాల 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్**



**కాకతీయ, పరకాల:** ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకోవాలని, సర్ కార్యక్రమం ద్వారా జారీ చేసిన నోటీసులకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని పరకాల 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ సూచించారు. ఓటును, కుటుంబ సభ్యుల ఓట్లను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నోటీసులకు సమాధానం ఇస్తూ ఏదైనా ఒక గుర్తింపు కార్డును బీఎల్‌వోకు అందిస్తే ఓటు భద్రంగా ఉంటుందని తెలిపారు. మంగళవారం 19వ వార్డులోని 46, 47 బూత్‌లలో సర్ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొయ్యడ శ్రీనివాస్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. సర్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పవన్, డీటీ సుమన్, ఆర్ఐ దామోదర్, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్‌కుమార్, బీఎల్‌వోలు సునీత, మల్లికాంబ, బీఎల్ఏలు దుప్పటి రాజేష్, ఎండీ షఫీ, అర్జున్, సతీష్, 19వ వార్డు ప్రజలు, 46, 47 బూత్‌ల ఓటర్లు పాల్గొన్నారు.

# గూండాగిరికి ముఖ్యమంత్రి ప్రోత్సాహం

- ఇలాంటి సీఎంతో శాంతిభద్రతలు ఏం కావాలి?
- రాజకీయ ప్రత్యర్థిని ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం ఏమిటి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**కాకతీయ, హైదరాబాద్ :** ముఖ్యమంత్రే సొంత పార్టీ నేతలను ఉసిగొల్పి గూండాగిరిని ప్రోత్సహిస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏం కావాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మంగళవారం ఎక్స్ వేదికగా రాష్ట్ర రాజకీయ పరిణామాలపై స్పందించారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం ఏమిటని నిలదీశారు. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యర్థి నాయకులు, కులాలు, వ్యవస్థలను దూషించడం ఇదే మొదటిసారి కాదని, ఆయనపై కాంగ్రెస్ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నేతలు దండయాత్రకు వెళ్లడం, ముఖ్యమంత్రే వారిని ఉసిగొల్పడం ఏమిటన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఏం పనిచేస్తోందో అర్థం కావడం లేదన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీలో రాజకీయాలు చేస్తున్నాయని కవిత విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ నిషేధిత భూముల సమస్య, ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడం, యూరియా కొరత, జీవో 97 రద్దు డిమాండ్, మహిళలపై అఘాయిత్యాలు, గురుకులాల్లో సమస్యలు, పీఆర్సీ, పెండింగ్ డీఏల వంటి అంశాలపై సభలో చర్చ జరగాలన్నారు.


**ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితి పెంచాలి**

పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని ఎస్సై ఉద్యోగాలకు 38 ఏళ్లు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 ఏళ్ల వరకు వయోపరిమితి పెంచాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వయోపరిమితి పెంచకుండా నోటిఫికేషన్ ఇవ్వడంతో లక్షలాది మంది అర్హత కోల్పోతున్నారని అన్నారు. 2024లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి జీవో నంబర్ 31 ద్వారా వయోపరిమితి పెంపు హామీ ఇచ్చి, తర్వాత నోటిఫికేషన్‌లో ఆ వెసులుబాటు తొలగించారని ఆరోపించారు. ప్రభుత్వ తాత్సారం కారణంగా 3 లక్షల మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు.

**20 వేల పోలీసు పోస్టులు భర్తీ చేయాలి**

రాష్ట్రంలో 20 వేల పోలీసు పోస్టులు ఖాళీగా ఉంటే 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని కవిత విమర్శించారు. మొత్తం 20 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు 200 పోస్టులు కూడా లేని పరిస్థితిలో లక్షలాది నిరుద్యోగులకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. హోంశాఖ ఒకటి, ప్రభుత్వం మరొకటి చెబుతున్నాయని మండిపడ్డారు. నిరుద్యోగుల తరఫున తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

# మన అంగన్వాడీ మన బాధ్యత



**కాకతీయ ప్రతినిధి - ఏలూరు :** మన అంగన్వాడీ మన బాధ్యత అని సీడీపీవో బ్యూలా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన పోషణ్ మహా కార్యక్రమంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మన అంగన్వాడీ మన బాధ్యతపై ముందస్తు ప్రణాళిక ఉంటుందని.. 9వ తేదీ నుంచి పోషణ్ మహా కార్యక్రమం ప్రతి అంగన్వాడీ సెంటర్లో ఘనంగా నిర్వహించాలన్నారు. 0 నుంచి 6 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల తల్లులకు, గర్భవతులకు, బాలింతలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బ్యూలా, సూపర్‌వైజర్ కె. పద్మజ్యోతి అంగన్వాడీ కార్యకర్తలపై పోషణ్ మహాపై పలు సూచనలు చేశారు.

# నేను చెప్పిందే వేదం..నా మాటే శాసనం

- ఇష్టారాజ్యంగా ములుగు డీటీవో ఈశ్వర్ సింగ్ విధులు
- యూనిఫాం పక్కన పెట్టి బనీన్‌పైనే డ్యూటీ
- ఇప్పటికే సార్‌పై అవినీతి ఆరోపణల వెల్లువ
- సెలవు రోజుల్లోనూ సార్ సైన్‌తో లైసెన్స్, సర్టిఫికెట్లు జారీ
- ఆధారాలతో బయటపెట్టిన కాకతీయ.. అయినా డీటీవోపై నో యాక్షన్
- డ్రైవింగ్ టెస్టులోనూ 'ముడుపులు' ఇస్తేనే పాస్?
- రవాణా శాఖ అధికారి తీరుపై విమర్శలు
- సార్ బాగోతాలపై కాకతీయ ప్రతినిధికి ఫోన్లు..!



**కాకతీయ, ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయం పెద్ద సారు నేను చెప్పిందే వేదం, నా మాట వినకుంటే బతుకులు ఛిద్రమే అన్న తీరు గా వ్యవహరిస్తూ కార్యాలయంలో అర్ధనగ్నంగా డ్యూటీ చేయడం అటు కార్యాలయ సిబ్బంది లోను, ఇటు వాహనదారుల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రవాణా శాఖ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు జరుగుతున్నాయంటూ దరఖాస్తుదారులు, వాహనదారులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) ఠాకూర్ ఈశ్వర్‌సింగ్ వ్యవహారశైలిపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బ్రోకర్లను కలిస్తేనే పని ముందుకు...?**

ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నిబంధనల ప్రకారం దరఖాస్తుల పరిశీలన జరగాల్సి ఉంటుంది. అవసరమైన పత్రాలు సక్రమంగా లేకుంటే సంబంధిత అధికారులు వాటిని తిరస్కరించడం లేదా లోపాలను సరి చేయాలని సూచించడం సాధారణ ప్రక్రియ. అయితే ములుగు కార్యాలయంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో తమకు అనుకూలంగా ఏర్పాటు చేసుకున్న బ్రోకర్లను ఆశ్రయిస్తేనే పనులు సులభంగా పూర్తవుతున్నాయని, లేదంటే దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయని వారు చెబుతున్నారు. సరైన పత్రాలు లేని దరఖాస్తులను సైతం ముందుకు తీసుకెళ్లాలని కింది స్థాయి సిబ్బందిపై డి టి ఓ ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సిబ్బందిపై ఒత్తిళ్లంటూ ఆరోపణలు**

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను తిరస్కరించే కింది స్థాయి ఉద్యోగులు పైస్థాయి నుంచి వచ్చే ఆదేశాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్యాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికారి ఆదేశాలను పాటించకపోతే కక్షసాధింపు చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో కొందరు ఉద్యోగులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులను దుర్భాషలాడుతూ చిన్నా పెద్ద తప్పులని చూడకుండా వారి పై ఇష్టం వచ్చినట్టు కార్యాలయంలో అందరి ముందు కేకలు వేయటం, ఏది ఏమైనా నేను చెప్పింది చేయాల్సిందే లేకుంటే మీకు బతుకు ఉండదు అని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని సిబ్బంది కూడా సదరు ఉన్నతాధికారిపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది.

**అర్ధనగ్నంగా డ్యూటీ..!**

ములుగు జిల్లా రవాణా శాఖ అధికారులకు విధి నిర్వహణలో యూనిఫామ్ నిబంధనలు పక్కన పెడితే కనీసం పూర్తిగా దుస్తులు ధరించకుండా ఒంటిపై బనియన్ తో అర్ధనగ్నంగా ములుగు డీటీఓ కార్యాలయంలో డ్యూటీ చేయటంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రవాణా శాఖ కార్యాలయంలో పనిపై పురుషులతోపాటు స్త్రీలు ధ్రువపత్రాల కోసం కార్యాలయానికి వస్తుంటారు. అయితే డ్యూటీ సమయంలో కనీసం సాధారణ దుస్తుల్లోనైనా ఉండాల్సిన అధికారి కార్యాలయంలో యూనిఫామ్ లేకుండా, మర్యాదపూర్వకమైన దుస్తులు కూడా లేకుండా విధులు నిర్వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజల తో పాటు సిబ్బంది ముందు అధికారి హోదాకు తగిన విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ బాధ్యత గల కుర్చీలో కూర్చొని బనియన్ పై అర్ధనగ్నంగా డ్యూటీ చేయడం పై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

**'లాగిన్' వ్యవహారంపై ఏమైంది.?**

ఇటీవల ములుగు రవాణా శాఖలో డీటీఓ లాగిన్ ఐడీ, డిజిటల్ సంతకం వినియోగానికి సంబంధించిన వ్యవహారం తీవ్ర చర్చకు దారి తీసింది. అధికారి విధుల్లో లేని సమయంలో ఆయన పేరుతో డిజిటల్ సంతకాలతో ధ్రువ పత్రాలు జారీ అయ్యాయనే ఆరోపణలు ఇప్పటికే ప్రశ్నలను లేవనెత్తాయి. ఈ వ్యవహారంపై సెప్టెంబర్ 2న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) వివరణ కోరినట్లు సమాచారం. అయితే దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేత ధోరణిలో వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు అధికారిక లాగిన్ వివరాలు ఎవరి వద్ద ఉన్నాయి? డిజిటల్ సంతకాన్ని ఎవరు వినియోగించారు? అధికారి విధుల్లో లేని సమయంలో ఆయన పేరుతో ధ్రువపత్రాలు ఎలా జారీ అయ్యాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల మౌనం ఎందుకు?**

ములుగు రవాణా శాఖ కార్యాలయంపై వరుసగా ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం ఇప్పటివరకు సమగ్ర విచారణకు ఆదేశించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. లాగిన్, డిజిటల్ సంతకాల వ్యవహారం నుంచి మొదలుకొని బ్రోకర్ల ద్వారా పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు, డ్రైవింగ్ టెస్టులపై అనుమానాలు, అధికారిపై వస్తున్న ఆస్తుల ఆరోపణలు.. ఇలా అనేక అంశాలు తెరపైకి వస్తున్న నేపథ్యంలో శాఖాపరమైన విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

**'ఎవరికి వాటాలు....?'**

ఇన్ని ఆరోపణలు వస్తున్నా చర్యలు ఎందుకు లేవన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అవినీతి ఆరోపణలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ఫిర్యాదులపై విచారణ ఎందుకు జరగడం లేదు? అనే ప్రశ్నలు వాహనదారుల నుంచి వినిపిస్తున్నాయి. 'అక్రమంగా సంపాదిస్తున్న సొమ్ములో ఉన్నతాధికారులకు కూడా వాటాలు ఉన్నాయా?' అంటూ జిల్లా ప్రజల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అనుమానాలకు తెరపడాలంటే ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ములుగు రవాణా శాఖ కార్యాలయంలో జరుగుతున్నాయంటూ వస్తున్న ఆరోపణలన్నింటిపైనా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లాగిన్ వినియోగం, డిజిటల్ సంతకాలు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ, బ్రోకర్ల వ్యవహారం, దరఖాస్తుల పెండింగ్, అధికారిపై వచ్చిన ఆస్తుల ఆరోపణలు.. ఇలా ప్రతి అంశాన్ని పరిశీలించి తప్పు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తాతా మధు వ్యాఖ్యలు బీఆర్ఎస్ స్క్రిప్టే

- కేసీఆర్ పదేళ్ల పాలనలో దళితులకు అన్యాయం
- కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డికే సామాజిక స్పృహ ఎక్కువ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ వ్యూహంలో భాగంగానే ఎమ్మెల్సీ తాతా మధుతో మాట్లాడించారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని, ఆయన పాలనలో దళితులు, మహిళలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని విమర్శించారు. సీఎల్పీలో మంగళవారం నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. టీషర్ట్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉండటంతోనే అడ్డుకున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇప్పటివరకు ఖండించలేదన్నారు. తాతా మధు మాట్లాడింది బీఆర్ఎస్ స్క్రిప్టేనని, వ్యూహం రూపొందించి ఆయనను పంపారని ఆరోపించారు. ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలు తాను వినలేదన్నారు. దళితులకు కాంగ్రెస్ అత్యున్నత పదవులు ఇచ్చిందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష నేత హోదా నుంచి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి భట్టి విక్రమార్కను తొలగించారని ఆరోపించారు. అర్ధరాత్రి రాజయ్యను బర్తరఫ్ చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ దళిత స్పీకర్‌ను అవమానించినప్పుడు ఖండించలేదని విమర్శించారు. మహిళలు లేకుండానే క్యాబినెట్ నడిపారని, పదేళ్లలో అంబేద్కర్‌కు దండ వేయలేదన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అధ్యక్షా అని పిలవాల్సి వస్తుందనే కారణంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని ఆరోపించారు. ఏ రాష్ట్రంలోనూ ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్‌లో ఉండరని అన్నారు. ఇక 22ఏ అంశాన్ని సమూలంగా సమీక్షించి సవరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల వడపోత పూర్తయిందని, ఖమ్మం, నల్గొండ, వరంగల్ స్థానానికి నాలుగు పేర్లు, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ స్థానానికి నాలుగు పేర్లను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కొండా సురేఖకు రెండోసారి సమస్యను ముగించుకోవాలని చెప్పానని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. తాను మంత్రి కావాలని ఎప్పుడూ కోరుకోలేదని, తనను ఇంతవరకు ఎవరూ అడగలేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలన్నదే కాంగ్రెస్ నేతలందరి ఆకాంక్ష అని తెలిపారు.

# మమ్మల్ని శత్రువులుగా చూడొద్దు

- అక్టోబర్ 30 వరకు గడువు ఇస్తే సీఎంఆర్ పూర్తి చేస్తాం
- తరుగు పేరుతో పెనాల్టీలు, వడ్డీలతో మిల్లర్లు నష్టపోతున్నారు
- నేటి నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నాం
- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్

**కాకతీయ, ములుగు ప్రతినిధి :** మమ్మల్ని శత్రువులుగా చూడకుండా ప్రభుత్వానికి భాగస్వాములుగా చూడాలని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్ కోరారు. అక్టోబర్ 30 వరకు గడువు ఇస్తే మిల్లింగ్ పూర్తి చేసి ప్రభుత్వానికి బియ్యం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం నుంచి ములుగు జిల్లాలో నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు. మిల్లర్ల సమస్యలు, పెరుగుతున్న నిర్వహణ వ్యయాలు, ప్రభుత్వం వద్ద పేరుకుపోయిన బకాయిలు, సీఎంఆర్ డెలివరీలపై ఒత్తిళ్లను దృష్టిలో ఉంచుకుని సమ్మె నిర్ణయం తీసుకున్నట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కేఎంఎస్ 202526 ధాన్యం సుమారు 9 నెలలు నిల్వ ఉండటంతో తేమ, బరువు తగ్గడం, రంగు మారడం, డ్యామేజ్ వంటి కారణాలతో తరుగు ఏర్పడిందన్నారు. దీనిని మిల్లర్ల తప్పిదంగా పరిగణించడం సరికాదన్నారు.

**బాయిల్డ్ బియ్యం తీసుకునేలా చర్యలు తీసుకోవాలి**

బాయిల్డ్ బియ్యానికి తగిన టార్గెట్ లేకపోవడం, గోదాముల్లో స్థలం లేకపోవడం, ఎఫ్‌సీఐ బియ్యం తీసుకోకపోవడంతో ధాన్యం పాడయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఎఫ్‌సీఐతో మాట్లాడి బాయిల్డ్ బియ్యం తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఫిజికల్ వెరిఫికేషన్ నిలిపివేయాలని, లేకపోతే సీఎంఆర్ బియ్యం డెలివరీలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. గత పదేళ్లుగా మిల్లింగ్, డ్రయేజ్, కస్టోడియన్, రవాణా చార్జీలు చెల్లించకపోవడంతో కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని తెలిపారు. సన్న బియ్యం పథకానికి తాము సహకరిస్తున్నామని, మిల్లర్లపై వివక్ష చూపకుండా న్యాయం చేయాలని బాదం ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సహోదర రెడ్డి, కోశాధికారి మోహన్‌తో పాటు పలువురు మిల్లర్లు పాల్గొన్నారు.



# కేసీఆర్ హత్యకు కుట్రలు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా కేసీఆర్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడుతుంటే.. తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ నుంచి కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లి బయలుదేరిన కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తొలుత బొల్లారం వద్ద, ఆ తర్వాత హకీంపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

**కాంగ్రెస్ శ్రేణులను ఎందుకు అనుమతించారు**

కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత పార్టీ అధినేత నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని కోరారు. ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెబుతున్నా.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని అన్నారు.

**తమ నాయకుడిని తామే కాపాడుకుంటాం**

హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను పోలీసులు నిలిపివేయడంతో బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయితే తమ నాయకుడిని తామే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ అన్నారు.

# కడియం సిగ్గుపడు..!

- కేసీఆర్ దళితులకు ఏం చేయలేదా.?!
- ఎన్టీఆర్ తర్వాత నీకు రాజకీయ బిక్ష పెట్టింది కేసీఆర్ కాదా?
- గల్లీలో ఉన్న నిన్ను ఢిల్లీకి తీసుకెళ్లింది ఎవరు?
- పార్టీలో గుర్తింపు, పదవి కల్పించింది కేసీఆర్ కాదా?
- పదవుల కోసం రేవంత్‌రెడ్డిని వెనకేసుకొస్తున్నావా?
- నిజంగా దళిత పక్షపాతివైతే స్పీకర్ పోడియం ముందు కూర్చో
- ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఫైర్

**కాకతీయ, హన్మకొండ :** కేసీఆర్ దళితులకు ఏమీ చేయలేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మండిపడ్డారు. రాజకీయంగా కడియం శ్రీహరి ఎదుగుదలకు కేసీఆర్ చేసిన సహకారాన్ని మరిచిపోయి ఇప్పుడు ఆయనపైనే విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్టీఆర్ అవకాశం ఇచ్చిన తర్వాత రాజకీయంగా పక్కకు వెళ్లిపోయిన కడియం శ్రీహరిని గల్లీ నుంచి ఢిల్లీకి తీసుకెళ్లింది కేసీఆర్ కాదా అని నిలదీశారు. పార్టీలో గుర్తింపు కల్పించి, రాజకీయంగా ఎదిగే అవకాశం ఇచ్చింది కూడా కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హన్మకొండ అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ ఎస్ నేతలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడారు. కడియం శ్రీహరిని ఉద్దేశించి తీవ్రంగా విమర్శలు చేశారు.

**గల్లీలో ఉన్న నిన్ను ఢిల్లీకి తీసుకెళ్లింది ఎవరు?**

ఎన్టీఆర్ రాజకీయంగా అవకాశం ఇచ్చిన తర్వాత పక్కకు వెళ్లి మూలకు కూర్చున్న కడియం శ్రీహరికి తిరిగి రాజకీయ గుర్తింపు కల్పించింది కేసీఆర్ కాదా అని వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. గల్లీలో ఉన్న వ్యక్తిని ఢిల్లీకి తీసుకెళ్లింది కేసీఆర్ చేసిన తప్పిదమా అని నిలదీశారు. రాజకీయంగా బిక్ష పెట్టి, పార్టీలో పెద్ద స్థానం కల్పించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. అలాంటి కేసీఆర్‌పైనే ఇప్పుడు దళితులపై ప్రేమ లేదని కడియం శ్రీహరి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని అన్నారు. గతంలో తన రాజకీయ జీవితానికి అండగా నిలిచిన నాయకుడిని మరిచిపోయి, ఇప్పుడు ఆయనపైనే ఆరోపణలు చేయడం కృతజ్ఞతా రాహిత్యమని విమర్శించారు. డబ్బు, పదవుల ఆశతోనే రేవంత్‌రెడ్డిని కడియం శ్రీహరి వెనకేసుకొస్తున్నారని వినయ్‌భాస్కర్ విమర్శించారు. రాజకీయ పదవుల కోసం ఒకప్పుడు తనకు అండగా నిలిచిన కేసీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు. కడియం శ్రీహరి తన రాజకీయ జీవితంలో ఎవరి వల్ల ఎదిగారో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. తన కులాన్నే అవమానించేలా రేవంత్‌రెడ్డి మాట్లాడిన సందర్భాల రికార్డులు ఉన్నాయని, వాటిని తమ మీడియా ద్వారా ప్రజల ముందుకు తీసుకొస్తామని వినయ్‌భాస్కర్ అన్నారు. రేవంత్‌రెడ్డి గురించి కడియం గతంలో మాట్లాడిన వ్యాఖ్యలను మరోసారి చూసుకోవాలని సూచించారు. ఆ రికార్డులు చూసిన తర్వాతైనా వాస్తవాలు గుర్తు చేసుకోవాలని అన్నారు.

**నిజంగా దళిత పక్షపాతివైతే స్పీకర్ పోడియం ముందు కూర్చో**

కడియం శ్రీహరికి దళితులపై నిజంగా ప్రేమ ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు జరుగుతున్న అవమానాలపై మాట్లాడాలని వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. పార్టీ గురించి, ఇతర నాయకుల గురించి మాట్లాడటం కంటే దళితుల సమస్యలపై నిలబడాలని సూచించారు. నిజంగా దళిత పక్షపాతి అయితే స్పీకర్ పోడియం ముందు కూర్చొని దళితుల తరఫున తన నిరసన వ్యక్తం చేయాలని సవాల్ చేశారు. తనకు రాజకీయంగా పదవి రావడానికి దోహదపడిన దళితుల పక్షాన నిలబడాలని, దళితుల సమస్యలపై పోరాడాలని అన్నారు. మాకందరికీ గౌరవం ఉండాలి.. రాజ్యాంగానికి గౌరవం ఉండాలి.. ప్రజాస్వామ్యానికి గౌరవం ఉండాలి అని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవులకు, సభా సంప్రదాయాలకు కూడా గౌరవం ఉండాలని స్పష్టం చేశారు.

**దళితుల కోసం కేసీఆర్ ఎన్నో పథకాలు**

కేసీఆర్‌కు దళితులపై ప్రేమ లేదని చెప్పడం వాస్తవాలను వక్రీకరించడమేనని వినయ్‌భాస్కర్ అన్నారు. దళితులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు వంటి కార్యక్రమాలను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దళితులు, బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ దళితులు, బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. అలాంటి నాయకుడిపైనే దళితులపై ప్రేమ లేదని కడియం శ్రీహరి మాట్లాడటం సిగ్గుచేటని వినయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను మరిచిపోయి మాట్లాడటం తగదని హితవు పలికారు.

# దొరల పాలన కాదు.. ప్రజా పాలన

- దళిత స్పీకర్‌ను అవమానిస్తే సహించేది లేదు
- తాతా మధుపై కేసు పెట్టి ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలి
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల తీరుపైనా చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్‌కుమార్



**కాకతీయ, ఏటూరునాగారం:** దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించేలా ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల తీరుకు నిరసనగా ఏటూరునాగారం బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీని రాజకీయ రణరంగంగా మార్చడం బాధ్యతారాహిత్యమన్నారు. తాతా మధు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల టీషర్టులు ధరించి నినాదాలు చేయడం, పోలీసులతో వాగ్వాదానికి దిగడం, మహిళా పోలీసుల సమక్షంలో అనుచితంగా ప్రవర్తించడం ఖండించాల్సిన విషయమన్నారు. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దొరల పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందని విజయ్‌కుమార్ అన్నారు. ఉద్యోగులు, కార్మికులు, ప్రజా సంఘాలు తమ సమస్యలపై స్వేచ్ఛగా ఆందోళనలు నిర్వహించే పరిస్థితి కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడటంలో కాంగ్రెస్ రాజీపడబోదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్టీఐ డైరెక్టర్ వాస్తాన శ్రీను, యూత్ జిల్లా అధ్యక్షుడు తాజు, ఆత్మ ములుగు జిల్లా చైర్మన్ చిటమట రఘు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గద్దల నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల యూత్ అధ్యక్షుడు గంట రాగూర్, టౌన్ అధ్యక్షుడు రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపీతో నొప్పులకు ఉపశమనం

- శారీరక కదలికలను పునరుద్ధరించవచ్చు
- ప్రతి గంటకు కొద్దిసేపు శరీరాన్ని కదిలించాలి
- తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ




**కాకతీయ,హన్మకొండ:** ఫిజియోథెరపీ ద్వారా నొప్పిని తగ్గించడంతో పాటు శరీరంలో తగ్గిన కదలికలను పునరుద్ధరించవచ్చని తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. పక్షవాతం, నడుము నొప్పి, మెడ నొప్పి, మోకాళ్ల నొప్పులు, నరాలు, కండరాల బలహీనత, మెదడు పక్షవాతం వంటి సమస్యల్లో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను డాక్టర్ రామకృష్ణ ప్రారంభించారు. ప్రస్తుత నిశ్చల జీవనశైలి కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి గంటకు కనీసం 2-3 నిమిషాలు శరీరాన్ని కదిలించాలని, ప్రతిరోజూ వ్యాయామం, శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోడిటెల్లి రాము, వరంగల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ రాకేశ్, డాక్టర్ కీర్తన, డాక్టర్ అజయ్, ఫిజియోథెరపీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, మెడికవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎనుమాముల మార్కెట్‌కు 4 రోజులు సెలవు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా 4 రోజులు సెలవు ఉన్నందున రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించవద్దని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రియాంక కోరారు. శుక్రవారం అమావాస్య సందర్భంగా, శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు, సోమవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. మంగళవారం మార్కెట్ యథావిధిగా పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారస్తులు, గుమాస్తాలు, దడవాయిలు, కార్మికులు సెలవు రోజులను గమనించి మార్కెట్‌కు సరుకులు తీసుకువచ్చి ఇబ్బందులకు గురికావద్దని చైర్‌పర్సన్ ప్రియాంక సూచించారు. మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

# పుష్కరిణి నిర్మాణానికి భూమి విరాళం

- స్వామివారి పుష్కరిణి నిర్మాణానికి దాతలు సహకరించాలి
- మాజీ సర్పంచ్ జ్ఞాపకార్థం రూ.8 లక్షల విలువైన గుంట భూమి విరాళం
- ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యుల విజ్ఞప్తి



**కాకతీయ, గీసుగొండ :** స్వామివారి పుష్కరిణి నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు కోరారు. ఊకల్ గ్రామ మాజీ సర్పంచ్ కీర్తిశేషులు పిన్నింటి రామారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పిన్నింటి సోమక్క రూ.8 లక్షల విలువైన గుంట భూమిని పుష్కరిణి నిర్మాణానికి విరాళంగా అందజేశారని తెలిపారు. మండలంలోని ఊకల్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాస చివరి మంగళవారం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి, వైదిక మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వరరావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, డీఎల్‌పీఓ వేదవతి, రాయ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరు సిగ్గుచేటు

- సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించారు
- ప్రజాస్వామ్య నిరసనలను అడ్డుకోవడం సరికాదు
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు




**కాకతీయ, హనుమకొండ:** అసెంబ్లీ ఆవరణలో మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరు సమాజానికి సిగ్గుచేటని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం సరికాదన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే బీఆర్ఎస్ శ్రేణులను అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. మంగళవారం హన్మకొండ అంబేద్కర్ జంక్షన్‌లో బీఆర్ ఎస్ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను 1000 రోజులు దాటినా అమలు చేయలేదని దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగాలు, కార్మికులకు ఉపాధి, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కడియం శ్రీహరి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కేసీఆర్ హయాంలో దళితుల సంక్షేమం కోసం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న రూ.12 లక్షల దళిత బంధు హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి.. లేకుంటే తప్పుకోవాలి

- తప్పుడు గ్యారెంటీ కార్డులతో ప్రజలను మోసం చేశారు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



**కాకతీయ, వరంగల్:** రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే తక్షణమే ప్రభుత్వం నుంచి తప్పుకోవాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 8 రోజుల నిరసన కార్యక్రమాల ముగింపు సందర్భంగా మంగళవారం వరంగల్ నగరంలోని కాశీబుగ్గలో అంబేద్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి వినోద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు గ్యారెంటీ కార్డులతో ప్రజలను మోసం చేసిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మహిళలకు తులం బంగారం, నగదు, రైతు భరోసా పెంపు, నిరుద్యోగ భృతి, ఆటో కార్మికులకు ఆర్థిక సాయం వంటి హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారని, నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారని వినోద్‌కుమార్ అన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం, హామీలు అమలు చేయడం చేతకాని ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్యాబినెట్‌లో వికెట్లు పడటం వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖతో మొదలైందని, రానున్న రోజుల్లో మరికొందరు ఉంటారా, పోతారా అనే చర్చ జరుగుతోందన్నారు. పదవిలో ఉన్నంతకాలం సహచరులను, ఎమ్మెల్యేలను కలుపుకొని మంచి పాలన అందించాలని, హామీలను అమలు చేయాలని సూచించారు.

# దళితుల హక్కులను హరించవద్దు

- తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్



**కాకతీయ, హన్మకొండ :** ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును హౌస్ అరెస్ట్‌ల పేరుతో అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. తనను సుబేదారి పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు. పార్టీ కఠిన చర్యలు తీసుకున్నప్పుడే దళిత సమాజంలో బీఆర్ఎస్‌పై నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను హరించే ప్రయత్నాలను సహించబోమని రామకృష్ణ స్పష్టం చేశారు. దళితులు, పేదలు, అణగారిన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి తరఫున నిలబడి పోరాడుతామని తెలిపారు.

# ప్రజల మనసుల్లో చల్లా ధర్మారెడ్డి

- పరకాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు
- బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



**కాకతీయ, గీసుకొండ:** పరకాల నియోజకవర్గ అభివృద్ధికి చల్లా ధర్మారెడ్డి విశేషంగా కృషి చేశారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గత పదేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా చల్లా ధర్మారెడ్డికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. మండలంలోని పీడీఆర్ ఫంక్షన్ హాల్లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, సాగునీటికి ప్రాధాన్యం ఇచ్చారని నాయకులు తెలిపారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ జన్మదిన వేడుకలకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడం ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్ఎస్ నాయకులు చల్లా వేణుగోపాల్ రెడ్డి, గుర్రం రఘు, బోడకుంట్ల ప్రకాష్, జైపాల్‌రెడ్డి, గోలి రాజయ్య, అంకతి నాగేశ్వరరావు, రఘుపతిరెడ్డి, కొల్లూరి రవీందర్, ధనుంజయ్, సుంకరి శివ, యువజన అధ్యక్షుడు సిరిషే శ్రీకాంత్, సల్ల రాజు, కోట ప్రమోద్, లెనిన్, మంద రాజేందర్, అభిషేక్, అభి, మహిళా నాయకురాళ్లు కొండ రాధా, రేణుక, సరిత, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మెటీరియల్ ను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్ గౌడ్**



కాకతీయ, నెల్లికుదురు : ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురులోని ఉచిత స్టడీ మెటీరియల్ ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సి.హెచ్ మదర్ గౌడ్ పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మెటీరియల్ ను ఉపయోగించుకొని విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి కాలేజీ కి మంచి ఉత్తమ ఫలితాలు వచ్చి సాధించాలన్నారు. మెటీరియల్ పంపిణీ చేసినటువంటి అర్థశాస్త్ర అధ్యాపకులు డా. ఎ .సుధాకర్ ని మరియు తెలుగు లెక్చరర్ ధూపటి శ్రీనివాస్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి అధ్యాపక బృందం శ్రీనివాస్, ప్రకాష్ బాబు, కవిరాజు, యాకన్న, బాబు, రాంమూర్తి, మహేందర్, రఘురాం , సుభాష్, అధ్యాపకేతర బృందం శ్రావణ్, ప్రదీప్, లక్ష్మణ్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి

**విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరి : ఎస్సై ప్రమోద్ కుమార్**



**కాకతీయ, పెద్దవంగర:** గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని ఎస్సై ప్రమోద్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేయకూడదని, రాత్రివేళల్లో గుంపులుగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని ఎస్సై సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ వైర్ల కింద మండపాలు, విగ్రహాలు ఏర్పాటు చేయవద్దన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీలు అమలులో కాంగ్రెస్ విఫలం

- రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది
- రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా అమలు చేయాలి
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మండిపాటు



**కాకతీయ, పెద్దవంగర :** కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసి రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య మండిపడ్డారు. ఉచిత విద్యుత్ సక్రమంగా అందక, రుణమాఫీ పూర్తికాక, రైతుభరోసా, రైతుబీమా అమలుకాక, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపు మేరకు మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈదురు ఐలయ్య మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హామీల అమలులో కాలయాపన చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామచంద్రయ్య శర్మ, సుదీర్ కుమార్, శ్రీరామ్ సంజయ్, బాలు నాయక్, వెంకట్రామయ్య, వేంకన్న, సుధాకర్, సమ్మయ్య, బిక్షపతి, రాము, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కట్కూరి సుగుణ మృతికి ఇనగాల నివాళి

**కట్కూరి రవి కుటుంబ సభ్యులకు పరామర్శ**



**కాకతీయ, గీసుకొండ :** కట్కూరి సుగుణ మృతి పట్ల హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం గొర్రెకుంటలోని కట్కూరి రవి నివాసానికి చేరుకుని సుగుణ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కట్కూరి రవి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వరంగల్ మహానగరపాలక సంస్థ 15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కూరి రవి మాతృమూర్తి కీ.శే. కట్కూరి సుగుణ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల సంపత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జెల్లా రాజ్‌కుమార్, 15వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ల్యాదల్ల సురేందర్, కట్కూరి సారయ్య, బందేల ప్రవీణ్, సిలివేరు ప్రవీణ్, రాజారపు చింటు, ఎర్ర అనిల్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# నాణ్యతలో రాజీ వద్దు

- నిర్ణీత గడువులో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- పనులు పూర్తయ్యే ముందు నాణ్యతను పరిశీలించాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశం

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిల్లుల చెల్లింపుల నిమిత్తం పూర్తయిన పనుల వివరాలను పరిశీలించారు. 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, ప్రకాశరెడ్డిపేటలో సీసీ రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. అనంతరం 22వ డివిజన్ పోచమ్మ మైదాన్, 21వ డివిజన్ ఎల్బీనగర్, 36వ డివిజన్ చింతల్, 38వ డివిజన్ ఖిలా వరంగల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పోచమ్మ మైదాన్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మంచినీటి పైప్‌లైన్ పనుల నాణ్యతను పరిశీలించి, పనులు పూర్తయ్యే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డీఈలు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266